# ఎడారి దీపాలు

దుబాయ్‌లోని ఓ గదిలో ఆ నలుగురూ విచారంగా కూచున్నారు... విషాదంగా కూచున్నారు. వారం రోజుల్నించి పని లేదు... రెండు రోజుల్నించి సరిగ్గా తిండి లేదు. నోట్లె తడి లేదు... విజిట్ వీసా మీద వచ్చి ఏదో పని చేసుకుంటూ బతుకుతున్నారు.

ఆరు నెల్లయినా కాలేదు... సౌదీ ప్రభుత్వం అందర్నీ తిరిగి పంపించాలనే కఠిన నిర్ణయాలతో... దొరికిపోతామన్న భయంతో బయటికి అడుగు పెట్టలేక... అక్కణ్ణించి ఎక్కడికి పారిపోవాలో అర్థం కాక బిక్కు బిక్కుమంటూ కూచున్నారు....

సుధాకర్‌ది, మల్లయ్యది కరీంనగర్ జిల్లా. తిరుపతిరెడ్డిది నిజామాబాద్, గంగన్నది ఆదిలాబాద్ జిల్లా...

అందరిదీ ఒకటే నిర్ణయం... తిరిగి వెళ్ళొద్దు... తిరిగి వెళ్ళొద్దు...

వెళితే... అప్పుల బాధలు... ఒక్కొక్కరు లక్షా యాభైవేల అప్పు తెచ్చి బ్రోకర్ గాని చేతిలో పెట్టి మోసపోయారు. కంపెనీ వీసా అని నమ్మించి పంపించాడు. ఇక్కడికొచ్చాక తెలిసింది... దగా పడ్డామని...

ఎవరూ మాట్లాడుకోవడం లేదు... అయినా ఎడతెరపిలేని ఆలోచనలు...

ఇంతలో ప్రభాకర్ వచ్చాడు. నాలుగు బ్రెడ్ ప్యాకెట్లు, కొంచెం టమాట చట్నీ పట్టుకొచ్చాడు. వస్తూనే... "ఏమి నిర్ణయించుకున్నారు. దేశం పోవుడా... మస్కట్ పారిపోవుడా... ఏదో ఒకటి తేల్చుకోండి" అన్నాడు.

నలుగురు ఏమీ మాట్లాడలేదు. మొహాల నిండా భయం కొట్టుమిట్టాడుతోంది. ఆకలి మీద ఉన్నట్టు బ్రెడ్ ప్యాకెట్లు ఆవురావురంటూ తిన్నారు. గటగటా నీళ్ళు తాగారు.

"ఏ నిర్ణయం చెప్పకపోతిరి" మళ్ళీ అడిగాడు ప్రభాకర్.

"దేశం పోవుడైతే లేదు" అన్నారు మల్లయ్య, తిరుపతిరెడ్డి.

"మరి, మస్కట్ పారిపోవాలంటే రిస్క్‌తో కూడుకున్న పని" అన్నాడు ప్రభాకర్.

"చేసిన అప్పు తీరనే లేదు. దేశం పోయేకంటే ఇక్కన్నే దొంగ బతుకైనా బతుక్కుంటూ ఎంతో కొంత సంపాదించకపోతే పెండ్లాం పోరగాళ్ళకు ఏం మొఖం చూపించుకోగలం" బాధగా అన్నాడు మల్లయ్య.

"మొత్తానికి మస్కటే పారిపోతాం అంటారు. కానీ బాగా ఆలోచించుకోండి" అన్నాడు ప్రభాకర్.

నలుగురూ దీనంగా మొహాలు చూసుకున్నారు. పది నిమిషాలపాటు మాటలు కరువయ్యాయి. కళ్ళలో సన్నటి కన్నీటి తెరలు కమ్ముకున్నాయి. ఏదీ చెప్పలేని స్థితి. భవిష్యత్ పట్ల ఏ ఆశ కనిపించడం లేదు. అయినా దేశం పోవడానికి ఏ ఒక్కరికి మనస్సొప్పడం లేదు.

"ప్రభాకరన్నా ! చావైనా రేవైనా ఇక్కన్నే... ఎట్లనన్న చేసి మస్కట్ పంపించే ప్రయత్నం చెయ్యి" అన్నాడు గంగన్న. ఆ మాటల్లో తెగింపు... గుండెల్లో తెగింపు... తన్నుకొచ్చేసింది.

"నాకైతే మీరు మస్కట్ పోవుడు... అక్కడ దొంగతనంగా బత్కుడు అస్సలే ఇష్టం లేదు. మన దేశం పోయి ఎట్లనో అప్పు తీర్చి భార్యాబిడ్డలతో కలిసి ఉంటేనే మంచిగా అనిపిస్తుంది. మరొక్కసారి ఆలోచించుకోండి... మేమంటే కంపెనీ వీసా మీద వచ్చినవాళ్లం కాబట్టి జీతం తక్కువైనా, ఎక్కువైనా భరిస్తున్నాం" అన్నాడు ప్రభాకర్.

"ఊర్లెకు ఈ మొఖాలు పెట్టుకొని పోయేకన్నా... ఇక్కన్నే చావనైనా చస్తాం కానీ తిరిగి వెళ్ళబుద్ధి కావడం లేదు" అన్నాడు సుధాకర్ గొంతులో దుఃఖం అడ్డుపడుతుంటే.

"ప్రభాకరన్నా ! ఎట్లనన్న జేసి మమ్మల్ని మస్కట్ పంపించే బాధ్యత నీదే" అంటూ చేతులు పట్టుకున్నాడు మల్లయ్య.

ప్రభాకర్ కొంతసేపు ఆలోచించాడు. సెల్‌ఫోన్ తీసి ఎవరికో ఫోన్ చేసి అరబ్బీ భాషలో పావుగంట సేపు మాట్లాడాడు.

"ఓ పని చేయండి. ఒక్కొక్కరికి మన దేశపు మూడు వందల రూపాయలు ఖర్చు అవుతాయి. కంకర మిషన్ ట్రాలీలో దాక్కొని పోవాలి. ఆ ట్రాలీ అయితే ఎవరూ గుర్తు పట్టరు. మస్కట్ బార్డర్‌లో సెక్యూరిటీ ఉన్నా... ట్యాంకు లోపల మీరు కూచుంటారు

కాబట్టి ఎవరికీ కనిపించరు. ట్రాలీ డ్రైవర్ నాకు తెలిసినోడు కాబట్టి తీసుకుపోవడానికి ఒప్పుకున్నాడు. మస్కట్‌లో దిగినాక తలోదిక్కు పోయి ఏదో ఒక పని చేసుకొని బతకాలి...మీరు పోతారంటే అర్ధగంటల ట్రాలీ బయలుదేరుతదట... మరొక్కసారి ఆలోచించుకోండి" చెప్పాడు ప్రభాకర్.

"ప్రభాకరన్నా ! ఇంకా ఆలోచించే పనే లేదు. మమ్మల్ని ఆ ట్రాలీ ఎక్కియ్యి" అన్నాడు మల్లయ్య.

"ఇదంతా రిస్క్‌తో కూడుకున్నది. మీరేమో చెబితే వింటలేరు. నాక్కూడా మిమ్మల్ని మస్కట్ పంపించడం అస్సలిష్టం లేదు కాని, బతుకు మీద మీరు పూర్తి తెగాయించిండ్రు కాబట్టి పంపిస్తున్నా... పోయినంక ఫోన్ చేసి చెప్పుండ్రి" అన్నాడు బాధగా ప్రభాకర్.

"నువు చేస్తున్న సహాయం మరువలేం ప్రభాకరన్నా ! తప్పకుండా ఫోన్ చేస్తాం" అన్నాడు సుధాకర్.

"దాందేముంది. మీరందరూ ఎక్కడో ఒక చోట మంచిగా బతికితే నాకంతే చాలు" బాధగానే అన్నాడు ప్రభాకర్. మరోసారి ఫోన్ చేసి అరబ్బీలో ఏదో మాట్లాడాడు.

"అర్ధగంటలో ట్రాలీ వస్తుంది. ఎక్కే ముందు డ్రైవర్‌కి డబ్బులు ఇవ్వండి. మిషన్ లోపల జాగ్రత్తగా కూర్చోండి. పోలీసోల్లు ట్రాలీ చెక్ చేసిన ట్యాంకు లోపల మీరున్నట్టు ఎవరికి కనిపించదు. మరి నాకు డ్యూటీ టైమయింది వెళ్ళొస్తా"నంటూ ఒక్కొక్కరిని కౌగిలించుకున్నాడు.

అందరి గొంతుల్లోనూ మాట పెగలని దుఃఖం... సుధాకర్ బలవంతంగా గొంతు పెకలించుకొని "మస్కట్ చేరినంక ఫోన్ చేస్తమే ప్రభాకరన్నా!" అని మాత్రం అనగలిగాడు.

ప్రభాకర్ భారంగా వీడ్కోలు తీసుకొని వెళ్లిపోయాడు.

❀ ❀ ❀

చీకటి గుహలో కూచున్నట్టుంది వాళ్ళకు...

ట్రాలీ వెళ్తున్న చప్పుడు తప్ప... ఏమి వినిపించడం లేదు... కనిపించడం లేదు...

చిమ్మ చీకట్లో... కత్తుల బోనులో కూచున్నట్టుంది. ట్రాలీ ఎటు వెళుతుందో కూడా అర్థం కాని పరిస్థితి... బండల్ని కరకర నమిలి కంకరగా మార్చే పదునైన యంత్రాల మధ్య బిక్కు బిక్కుమంటూ కూచ్చున్నారు. నలుగురిలో ఎవరికి ఎవరూ కనిపించడం లేదు. అందరి మధ్య మాటలు పెగలని నిశ్శబ్దం... గుండెల్నిండా పొగచూరిన దిగులు... మెదట్లో తల్లీ చెల్లీ భార్యాబిడ్డలు గుర్తొచ్చి కళ్ళు తడితడిగా మారుతున్నాయి... ఊరు గుర్తొస్తుంది... ఇక్కడికి తరుముకొచ్చిన కరువు గుర్తొస్తుంది...

సన్నగా ఏడ్పు వినిపించింది...

ఆ ఏడ్పు... సుధాకర్‌దని మిగతా ముగ్గురు అర్థం చేసుకున్నారు. ఓదార్చడానికి కూడా ఎవరికీ ధైర్యం చాలలేదు. పది నిమిషాల తరువాత "సుధాకర్ ఏడ్వకురా... మన తలరాత గిట్లుంది" అని మాత్రం అనగలిగాడు మల్లయ్య.

"ఇంకెందుకురా ఏడ్పు... తెగించినోడికి తెడ్డే లింగం... మన ఊర్లు మంచిగుంటే ఈ దేశం గాని దేశం ఎందుకొచ్చేటోళ్లం. అక్కడ పని దొరికితే ఇక్కడ ఈ దొంగ బతుకులు ఎందుకు బతికేటోళ్ళం. రెండు నాగళ్ళ వ్యవసాయం నాది. అమ్ముడు పోయి అప్పుల పాలై ఈ పరిస్థితి వచ్చింది." కళ్ళల్లో నీళ్ళు ఉబుకుతుంటే అన్నాడు గంగాధర్.

"అది కాదే గంగన్న... చంటిది గుర్తొచ్చింది. మనమేమో ఇక్కడ కుడిదిల వద్ద ఎలకలెక్క కొట్టుకోవడితిమి" దుఃఖాన్ని దిగమింగుకుంటూ చెప్పాడు సుధాకర్.

"సౌదీలో ఎట్లనో బతకొచ్చని సగం ఊర్లు ఖాళీయై వచ్చినయి. నేనైతే యాడాదికి తులానికి తులంన్నర వడ్డీకింద అప్పుచేసి వచ్చిన. అవి ఎట్ల తేరాలి. ఈ బతుకెట్ల మారాలి" బెంగపడుతూ చెప్పాడు మల్లయ్య.

"నేను బిడ్డ పెండ్లి చేసి అప్పుల పాలైతిని. రెండెకరాల భూమిలో మూడు బోర్లు వేయించినా సుక్క నీరు రాకపాయే... అల్లునికింకా కట్నం పైసలు నలుపై వేల దాకా ఇయ్యాలే... పంపకపోతే పుట్టింట్ల దించుతానని బెదిరిస్తుండట" బాధగా చెప్పాడు తిరుపతిరెడ్డి.

"ఇంతమందిని గల్ఫ్ నుంచి వెళ్ళగొడ్తున్నా, మనల్ని పట్టించుకునే నాథుడే లేకపాయే..." అన్నాడు సుధాకర్.

చీకట్లో వాళ్ళ మాటలు తప్ప ఎవరి మొహాలు కనిపించడం లేదు. ట్రాలీ స్లో అయినప్పుడు చెకింగ్ జరుగుతుందేమోనని బతుకు భయంతో ముడుచుకొని మౌనంగా ఉంటున్నారు.

"వలసలు ఒక సమస్య అని... గల్ఫ్ పయనం తీరని గాయమని ఏ ప్రభుత్వాలు మన దేశంలో గుర్తించకపాయే. నేను దుబాయిలో ఉన్నా మన ఊర్లో నా ఓటు మాత్రం ఎవడో ఒకడు వేసుకొని గెలుస్తూనే ఉన్నాడు" అన్నాడు మల్లయ్య.

"అదికాదే మల్లన్నా! మొన్న ఫోన్‌లో నా బిడ్డ చెప్పింది. ఎక్కడో తుఫాను వచ్చిందని ఉద్యోగస్తుల ఒక్కరోజు జీతం కట్ చేసింద్రట. స్వచ్ఛంద సంస్థలు బట్టలు, బియ్యం సేకరించి పంపింద్రట. సినిమా యాక్టర్లు కూడా దిగొచ్చి విరాళాలు వసూలు చేసింద్రట. మరి గల్ఫ్ సమస్య కూడా తెలంగాణలో వచ్చిన తుఫాను లెక్కనే గదనే. మనకు ఎవరూ సాయం చేయరేంది అని అడిగింది. దానికి నేనేం జవాబు చెప్పాల్నో అర్థం కాలేదు" అన్నాడు తిరుపతిరెడ్డి.

"అంతదూరం ఎందుకే తిరుపతన్నా! మల్లేశం దుబాయిల చచ్చిపోతే శవాన్ని

పంపించటానికి ఇక్కడ ఎన్ని కష్టాలు పడ్డా... ఎవరూ సాయం చెయ్యకపాయె... మనమే విరాళాలేసుకొని శవపేటిక పంపటానికి పదిహేను రోజులు పట్టింది. ఇట్ల తెలంగాణ పల్లెలకు రోజు రెండు శవపేటికలన్నా గల్ఫ్ నుంచి పోతున్నాయంటే... దేశం గాని దేశంల మనమెట్ల బతుకుతున్నామో ఎవలర్థం చేసుకోవాలె..." దుఃఖం సుడులు తిరుగుతుంటే చెప్పాడు గంగన్న. "శవ పేటిక చేరే పదిహేను , నెల రోజుల్లల్లా అక్కడ ఏడ్చి ఏడ్చి వాళ్ళు శవాలవుతున్నారు" అన్నాడు సుధాకర్.

ట్రాలీ ఆగింది... వీళ్ళ మాటలు ఆగిపోయాయి.

బయటి నుంచి అరబ్బు భాషలో ఏవో మాటలు లీలగా వినిపించాయి.

తిరుపతిరెడ్డి గుసగుసగా చెప్పాడు.

"చెకింగ్ జరుగుతున్నట్టుంది. మాట్లాడకుండ్రి... ఇట్లాంటి ఇంకో రెండు చెకింగులైతే మనం మస్కట్‌లో పడతాం."

పది నిమిషాల తరువాత ట్రాలీ మళ్లీ కదిలింది.

ట్రాలీ లోపల సిమెంటు కంకర ఎండిపోయి అదో రకం దుర్వాసనలా వస్తోంది. అయినా భరిస్తూ కూచున్నారు.

నిజానికి వాళ్ళు నలుగురూ... ఒక్కో కుల వృత్తిలో నిష్ణాతులు. మగ్గం మీద ఇంద్రధనస్సులు పూయించగల మల్లయ్య... దోసెడు నీళ్ళు దొరికితే ఎకరాన పుట్టెడు వడ్లు పండించే తిరుపతిరెడ్డి... అద్భుతమైన నాటకాలేసే సుధాకర్... బంగారానికి ప్రాణం పోసే గంగన్న...

ఎవరి మనసులో వాళ్ళ వాళ్ళ వృత్తులు గుర్తొచ్చాయి.

"భూమిని అమ్ముకున్నంక... అదే భూమిలో పాలేరుగా పని చేయడమంత నరకం ఇంకేముంటదే మల్లన్న... ట్రాక్టర్ మీద పొలానికి పోవాలన్న కోరికుండె. ఈ ట్రాలీల వడి పోవడితిని" దీర్ఘాలోచనలో అన్నాడు తిరుపతిరెడ్డి.

"నాకైతే మా నాయన ఉరిపోసుకున్నాక... మగ్గం ఆడించాలంటే చేతులాడకపోయేవి. నా చావు ఎట్ల రాసున్నదో" బాధగా చెప్పాడు మల్లయ్య.

"కష్టాలన్నీ మర్చిపోయేటట్లు మెల్లగా ఓపాట పాడరాదురా సుధాకర్" అని అడిగాడు గంగన్న.

"దుఃఖం తన్నుకొచ్చి గొంతు నాలుక తెగిపోయేటట్లున్నయే... ఏం పాట పాడాలే" జీర గొంతుతో అన్నాడు సుధాకర్.

"వాని పాటనే కొంప ముంచింది... అన్నల పాటలు పాడుతున్నాడని పోలీసొల్లు తంతే దుబాయిల వచ్చి పడ్డడు" చెప్పాడు తిరుపతిరెడ్డి.

"సరేగాని... మస్కట్ల ఎలాగైనా లేబర్ కార్డు సంపాదించుకోవాలె. మస్కట్ల రూల్స్ కఠినంగా ఉంటాయట!" అన్నాడు మల్లయ్య.

ట్రాలీ కుదుపులకు లోపల కత్తెర్ల లాంటివి గుచ్చుకుపోతున్నాయి.

"నిప్పుల్ల దునికినం... ఎండకు భయపడతమా... సుధాకర్ పాటందుకోరా..." ధైర్యాన్ని పంచాలనే ఆశతో అన్నాడు గంగన్న.

"ఈ పరిస్థితుల ఏం పాట పాడాల్నే.. చీకట్ల ఎటు పోతున్నమో అర్థమైతలేదు" అన్నాడు సుధాకర్.

"ఏం కాదురా... తెగిన పతంగీలం... ఏం అయితే అదయితది..." అన్నాడు గంగన్న.

"నాకు నా సుజాత యాదికొస్తుంది. దాని మీద రాసిన పాట పాడుతా... " అని బలవంతంగా కూనిరాగం తీసిండు.

ఇంతలో ట్రాలీ ఆగింది.

పాట ఆగింది...

మళ్ళీ చెకింగ్ అవుతున్నట్లుందని... అందరూ నిశ్శబ్దంగా... భయంతో ముడుచుకుపోయారు.

❀ ❀ ❀

మస్కట్ పొలిమేరల్లో... బారులు తీరిన వాహనాలు... సెక్యూరిటీ బాగా ఉంది... సీరియస్‌గా చెక్ చేస్తున్నారు. మక్కా యాత్ర అయిపోయాక ఇంకా ఎవరైనా దేశంలోనే ఉన్నారేమోనన్న తనిఖీలు ఎక్కువైపోయాయి.

ట్రాలీ డ్రైవర్‌ను దిగమన్నాడు పోలీస్.

అరబ్బీ భాషలో అడిగాడు... 'లోపల ఏముందని...?"

"కంకర మిషన్ సాబ్... లోపల కొంచెం కంకర, సిమెంటు తప్ప ఏమీ లేవు" అరబ్బీ భాషలో చెప్పాడు డ్రైవర్ భయం భయంగా...

ట్రాలీ చుట్టూ తిరిగి వెళ్లిపొమ్మన్నాడు.

చెమటలు తుడుచుకుంటూ... భయాన్ని కప్పిపుచ్చుకుంటూ డ్రైవర్ ఎక్కి స్టార్ట్

చేయగానే... 'ఏక్ మినట్...' అని పోలీస్ ట్రాలీ క్యాబిన్‌లోకి ఎక్కాడు.

"లోపల ఏమీ లేవంటావ్...' అన్నాడు అనుమానంగా.

"ఏమీ లేవుసాబ్..." డ్రైవర్ నిలువెల్లా వణికిపోయాడు. పారిపోవడానికి సిద్ధపడుతూ...

"ఓకె... ఓకె..." పోలీసోడి చూపుడు వేలు 'మిషన్ ఆన్ బటన్'ని సడెన్‌గా నొక్కింది. వెనుక నించి బర్‌ర్‌ర్‌ర్‌ర్... మన్న శబ్దం... డ్రైవర్ క్షణాల్లో మాయమయ్యాడు.

పది నిమిషాల్లోనే

ఇనుప కత్తుల నడుమ....

ఖండఖండాలైపోయిన పాట...

ముక్కలైపోయిన నూలుదారం...

చెక్కలైపోయిన కర్రునాగలి...

నెత్తుటి ముద్దయిన బంగారం...

ఎడారి వలసలు బాధాకరం...

ఆ వలస చావులు భయంకరం !!

( అర్ధరాత్రి...దుబాయినుంచి ఒక మిత్రుడి ఫోను...సంఘటన ఇలా జరిగింది. ఆ నలుగురు మన జిల్లాల వాళ్ళేనని అర్ధమైపోయింది. కాని వాళ్ళు ఎవరైంది తెలుసుకోవడం ఇంక సాధ్యం కాదేమో...అన్నాడు. ఈ సంఘటన చాలా రోజులు వెంటాడింది. ముగింపు రాయడానికి మనసొప్పలేదు...)